# అతిధి దేముడు

నాలుగు వైపులనించి కమ్ముకొస్తున్న నల్లని మేఘాలని, ఎనిమిది గంటలు చూపిస్తున్న గడియారాన్ని చూసి, ఇంకా క్లబ్బునించి ఇంటికిరాని అయ్యగారిని తలచుకొని గాభరాపడింది సీతమ్మ.

గాలి, మెరుపులు ఆరంభించాయి. ఇంకా భోజనాలవ లేదు. వెళ్ళిపోతానంటే... ఏమంటారో... ఇంట్లో చిన్న పిల్లలు ఒక్కళ్ళూ. సావిడిలో కూర్చుని ఆ రోజే వచ్చిన కొత్తపత్రిక పఠనంలో మిగతా ప్రపంచాన్ని మరిచిపోయిన యజమానురాలిని అడగలేక సావిట్లో తచ్చాడుతూంది సీతమ్మ.

కళ్ళు మిరుమిట్లుగొలిపిన మెరుపు కాంతికి ఇంటావిడ కళ్ళజోడులోంచి కళ్లెత్తి ఈ లోకాన్ని చూసింది. "సీతమ్మా వర్షం వచ్చేట్టూంది... గాలి వేస్తూంది ఆ కిటికీ మూసెయ్యి" అంది. ఆవిడ ఆజ్ఞ అమలుజరిపి ఆవిడ మళ్ళీ పుస్తకంలోకి తలొంచకముందే "అమ్మగారూ !" అంది ఆరాటంగా సీతమ్మ.

"ఊఁ..." అంటూనే ఆవిడ తల దించేసింది పుస్తకంలోకి.

"వర్షం ముంచుకొస్తూంది...పిల్లలు ఒకళ్ళూ వున్నారు ఇంట్లో. వెడతానమ్మా... తడిసిపోతాను ఇంటికెళ్ళేసరికి."

"అయ్యగారింకా రాందే... భోజనాలు అవందే..." అందావిడ ముఖం చిట్లించి.

"అన్నీ టేబిల్ మీద సర్దేశాను...వంటిల్లు అది కడిగేసానమ్మా... తవరు భోంచేసి ఆ కంచాలు అవీ అలా వదిలేయండి, ప్రొద్దుటే వచ్చి తీసేస్తాను."

"ఊ..." మూలిగింది ఆవిడ...అయిష్టం సూచిస్తూనే. ఇంకా పోకుండా అక్కడే తచ్చాడుతున్న సీతమ్మని ఏమిటన్నట్టు చూసిందావిడ.

"మధ్యాహ్నం పులుసు కాస్త మిగిలింది తీసికెడతాను, మీరు వేసుకోరుగా..." సందేహిస్తూనే అడిగింది.

"తీసుకెళ్ళు గానీ, గిన్నె పట్రా... ఇలా కూరలు పులుసులు తీసికెళ్ళడం ఆ గిన్నె వచ్చిందీ లేదో చూసుకోవడం నాకు చిరాకు... వెధవ గొడవ... ఊ... పట్టుకెళ్లు" అందావిడ కసిరి, ఇంక పొమ్మన్నట్టు పుస్తకంలో మునిగింది.

సీతమ్మ బ్రతుకు జీవుడా అన్నట్టు గిన్నెమీదుగా కొంగు కప్పుకుని గబగబ వీధిలో పడింది. సీతమ్మతోపాటు జల్లు, ఎడాపెడా గాలి, మెరుపులు, ఉరుములు బయలుదేరాయి. రెండు ఫర్లాంగులు నడిచి ఇల్లు చేరే వేళకి, మొత్తేసిన వర్షంతో, సీతమ్మ పూర్తిగా తడిసింది. నీళ్ళోడుతూ తనతోపాటు ఇంత జల్లుని లోపలికి తీసుకొచ్చి తలుపులు మూసింది సీతమ్మ. ఇంట్లో పిల్లలిద్దరూ బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు దీపం ముందు.

"అమ్మా. తడిసిపోయావా...అబ్బ ఎంతగా లేస్తూందనుకున్నావు... పెద్ద వర్షం పడుతూందిగదూ !" తల్లి రావడంతో పిల్లలిద్దరూ లేచి తల్లికి ఎదురెళ్ళి ఆరాటంగా అడిగారు.

గదిలోంచి పంచలోకి వెళ్ళి తడిసిన చీర మార్చుకుంది సీతమ్మ. తల తుడుచుకుంది.

"అబ్బ, ఏం వర్షం. తోవ కనిపించలేదు. ఎంత గాలి, అడుగు తీసి అడుగు పెట్టడమే కష్టమైంది. ఎలాగో తడిశాను కదా అని, మీ రొంటరిగా వున్నారని అలాగే తడిసి వచ్చేశాను ఎక్కడా ఆగకుండ... అన్నం తిన్నారా మీరిద్దరూ... అయ్యో, మీకిష్టమని తోటకూర పులుసు తెచ్చాను.... పోన్లెండి నే తిన్నప్పుడు రెండు ముద్దలు పెడతాను" అంది సీతమ్మ.

లాంతరు దీపం పెట్టుకుని, పీట వాల్చుకుని సీతమ్మ అన్నంముందు కూర్చుంది. పులుసన్నం ఇంత కలిపి పిల్లలిద్దరికీ రెండుముద్దలు పెట్టి, మిగతాది తను తిని, తర్వాత మజ్జిగ వేసేసుకుంది. "అమ్మా పచ్చడి వేసుకోవూ...." అన్నాడు కొడుకు.

"వద్దులేరా... రేపటికి చద్దన్నంలోకి మీకుంటుంది, పులుసన్నం తిన్నాగా..." అంది సీతమ్మ. సీతమ్మ అన్నంతిని, దీపం పట్టుకుని ముందు గదిలోకి వచ్చేసరికి వీధితలుపు దబ దబ చప్పుడయింది. ఈ వర్షంలో తనింటికి యీ వేళప్పుడు వచ్చేవారెవరు !... మళ్ళీ గట్టిగా చప్పుడయింది.

"ఎవరూ !" అంది సీతమ్మ తలుపు గడియ తీసే ముందు.

"తలుపు తీయండి, వర్షంలో తడిసిపోతూ వచ్చాను" అన్న మగ గొంతు విన్పించింది. సీతమ్మ ఒక్క క్షణం సందేహించింది. అంతలోనే అవతల మనిషి వర్షంలో తడిసి పోతున్న సంగతి గుర్తువచ్చి ఇంక సందేహించ లేదు.

తలుపు తెరవడంతో వర్షం జల్లుతోపాటు, యింత సెంటు పరిమళం సీతమ్మ మొహానకొట్టి... లోపలికివచ్చాడు అగంతకుడు. లోపలికి వస్తూనే అతను తలుపులు బలంగా నొక్కి గడియపెట్టాడు.

అతను శుభ్రంగా తడిసిపోయి నీళ్ళోడుతున్నాడు. ఖరీదయిన టెర్లిన్ ప్యాంటు, స్లాక్, బూట్లు, అన్నీ అతను ఖరీదయిన మనిషని చెప్పక చెపుతున్నాయి. బాగా పెంచిన జుత్తు, సైడ్ బరన్స్, అతన్ని ఆధునికుడిగా తెలియచేస్తు న్నాయి ... పాతికేళ్ళలోపు అతని వయసు. అతను ఏ కాలేజీ కుర్రాడోనని చెపుతూంది.

అతను గదిలోకి వచ్చి ఒక్క క్షణం చుట్టూ చూసి తరువాత సీతమ్మవంక చూసి "క్షమించండి వర్షంలో తడిసి పోయాను. మీ యిల్లుతప్ప ... ఈ చుట్టుప్రక్కల ఎక్కడా ఆగుదామన్నా ఏం కనపడలేదు ... పోనీ ఎలాగో తడిశాను అలాగే వెళ్ళిపోదామన్నా సరిగా యిక్కడికి వచ్చేసరికి స్కూటర్లో పెట్రోలు అయిపోయి ఆగిపోయింది" సంజాయిషీ యిచ్చాడు.

"అయ్యో పాపం, పూర్తిగా తడిసిపోయారు ... వుండండి, తువ్వాలిస్తాను ... తుడుచుకుందురుగాని."

"పరవాలేదండి, కాస్త తగ్గాక వెళ్ళిపోతాను..."

"అంతవరకు అలా నీళ్ళోడుతూంటేజబ్బు చెయ్యదూ. పరవాలేదు తుడుచుకోండి..." అంటూ సీతమ్మ తుండుగుడ్డ అందించింది. అతను తల తుడుచుకున్నాడు. షర్టు విప్పి నీళ్లు పిండి కిటికీ రెక్కమీద ఆరేశాడు. పేంటు నీళ్ళు కారుతున్నా మరోదారిలేక అలాగే వుండిపోయాడు. అతనికి కట్టుకోడానికి ఏదన్నా ఇస్తే బాగుండుననిపించినా, అతనికి యీయతగ్గవి ఏం కనిపించలేదు సీతమ్మకి. తడిసిన చీర, కట్టుకున్న చీర, చాకలి దగ్గిరున్న చీరతప్ప ఏం వున్నాయి తన దగ్గిర అనుకుంది. ఓ క్షణం పోయాక పెట్టె అడుగున పరిచిన భర్త పాతపంచె ఒకటి వుండాలని గుర్తు వచ్చి పెట్టె తెరిచి అది తీసింది. ఆ యువకుడికి ఆ పంచె యీయాలంటే మొహమాటం అన్పించినా అదే అందించింది. "ఇంట్లో ఇంకేమీ లేదు. ఇది ...ఇది మీకు కావలిస్తే కట్టుకోండి..." బిడియంగా అంది.

అతను 'పరవాలేదులెండి' అన్నా ... వంటినంటుకుపోయిన లైట్ ప్యాంటు, నీళ్ళు గారుతున్న ఆ ప్యాంటుతో కూర్చోగలగడం అటుంచి నిలబడడంకూడా కష్టమనిపించింది. అటు బయట వర్షం తగ్గే సూచన కనపడలేదు.

"వర్షం తగ్గేట్టులేదు, బట్టలు మార్చుకుని కూర్చోండి, ఎంతసేపలా నిలబడగలరు ... పరవాలేదు కట్టుకోండి"

అంటూ సీతమ్మ వంటింటిలోకి వెళ్ళింది. తప్పదన్నట్టు ఆ పంచెని రెండు మడతలు వేసి లుంగీ కట్టుకున్నాడు అతను

సీతమ్మ వచ్చి ఉన్న ఆ ఒక్క నులకమంచం ముందుకి జరిపింది. "కూర్చోండి... ఎంత సేపు నిలబడతారు..."

అతను కూర్చున్నాడు. "బయలుదేరేసరికి వర్షం లేదండి, నగందూరం వచ్చేసరికి మొత్తేసింది ... అందులో పెట్రోలూ ఇప్పుడే అయిపోవాలా ... పాపం అనవసరంగా మీకిచ్చింది ..." నొచ్చుకుంటు అన్నాడు.

"ఇబ్బందికేముంది లెండి ..." సీతమ్మ మోహమాటంగానే అంది. వున్నది ఒక్కటే గది! అపరిచిత యువకుడు. రాత్రి! ... అతనిముందే కూర్చోలేక మానలేక ఇబ్బందిగానే వుంది సీతమ్మకి.

అతను సిగరెట్టుపెట్టె తీశాడు. అగ్గిపెట్టె తడిసి వెలగలేదు. అదిచూసి సీతమ్మ లోపల్నించి అగ్గిపెట్టె తీసుకొచ్చి ఇచ్చింది .. "ఇన్ని పాలన్నాలేవు. కొంచెం టీ చేసి యిద్దామన్నా ..." అంది.

"అయ్యో...బాగుంది. అవన్నీ ఎందుకండీ. .వర్షంలో తడిసి వచ్చాను నా అవసరంకొద్ది ...." అతను బిడియంగా అన్నాడు.

పిల్లలిద్దరూ కొత్తవ్యక్తిని కాసేపు కుతూహలంగా చూశారు. తరువాత నిద్రకి ఆగలేక కునికిపాట్లు పడుతున్నారు. సీతమ్మ ... ... మంచంమీద అతను కూర్చున్నాడు. కనక పిల్లలిద్దరికి చాపమీద బొంత పరిచింది ...... "మీరిద్దరూ పడుకోండర్రా ... జోగుతున్నారు..." అంది.

"అయ్యో ... మంచం తీసుకోండి, ఆ చాప యిలా యీయండి. నేను కూర్చుంటాను... ప్చ్... నావల్ల మీకెంత ఇబ్బంది అయింది ... ప్లీజ్ ... మీరు కూర్చోండి ఎంతకని నిలబడతారు ..." నిలబడి నొచ్చుకుంటూ అన్నాడు.

"అయ్యో పరవాలేదు కూర్చోండి ... కూర్చోండి... పిల్లలు ఇలా పడుకుంటారు లెండి. ఒక్క పూటకి ఏముంది. ఏదో వర్షం వచ్చింది గనక మీరు వచ్చారు. లేక పోతే మాలాంటి వాళ్ళ ఇళ్ళకి మీరెందుకు వస్తారు ... కూర్చోండి ..." అంది సీతమ్మ పిల్లలిద్దరిని పడుకోబెట్టి, ఆ చాపమీదే కూర్చుంది సీతమ్మ

బొట్టులేని ఆమె ముఖం చూసి 'మీ వారికేం పని!' అని అడగాలనుకున్న ప్రశ్న అడగడం అనవసరమను కున్నాడు అతను. పాపం! ఈ చిన్నపిల్లలిద్దరినీ పెట్టుకుని ఎలా, ఏ ఆధారంతో జీవిస్తూందో ... అడగాలనివున్నా సభ్యత అడ్డువచ్చి అడగలేకపోయాడు. ఆ గదిలోవున్న ఒక్క నులకమంచం, రెండు పాత ట్రంకు పెట్టెలు, దండెం మీద మాసిన గుడ్డలు, చాపమీద బొంత, అలమారాలో అద్దంముక్క, పళ్ళూడిన దువ్వెన .. కావిడిపెట్టెమీదవున్న నాలుగయిదు గిన్నెలు...ఏది చూసినా ఆమె లేమిని పట్టిస్తు న్నాయి ... గదిని, ఆమెని చూసిన అతను పాపం అని మరో సారి అనుకున్నాడు.

సూటుబూటుతో గొప్పింటి బిడ్డగా కనిపించే అతన్ని చనువుగా మీ నాన్నకేంపని, ఏం చదువుకున్నావు, ఏం

ఉద్యోగం చేస్తున్నావు అని అడగాలనుకున్న ప్రశ్నలని అడగలేకపోయింది సీతమ్మ.

నులక మంచంమీద కూర్చుని సిగరెట్టు కాల్చుకుంటూ వర్షం తగ్గడంకోసం ఆరాటంగా చూస్తున్నాడు అతను.

అతను వెడితే నిద్రపోదాం అనుకుంటూ సీతమ్మ నిద్ర ముంచుకువస్తున్నా ఆపుకుంటూ కూర్చుంది. చీకట్నే లేచి యింట్లో పనిపాట చూసుకుని, అక్కడికెళ్ళి రోజంతా చాకిరీ చేసిన సీతమ్మ నిద్రకి ఆగలేక కూర్చునే కునికిపాట్లు పడుతూంది.

ఛా... పాడు వర్షం యిలా పట్టుకుందేమిటి! తన ప్రోగ్రాం అంతా అప్సెట్ అయిపోయింది. సిగరెట్టుమీద సిగరెట్టు కాలుస్తూ చిరాకు పడిపోతున్నాడు అతను.

సీతమ్మ అలా గోడకి జారగిలబడే నిద్రలోకి జారింది.

సీతమ్మని చూస్తుంటే పాపం అన్పించింది అతనికి. తను వెడితే పాపం హాయిగా పడుకుని నిద్రపోతుంది! పరాయి మగాడిని ఎదురుగా పెట్టుకుని ఎలా పడుకోగలదు ఆవిడ. ఇలా... ఒక్కటే గదివుందని తెలిస్తే మరి కాస్త దూరం వెళ్ళి ఇంకెవరి ఇంటిముందన్నా ఆగేవాడు! వెళ్ళిపోతే... స్కూటర్ వదిలేసి నడిచి వెళితే... అసలు వర్షం కాస్తన్నా తగ్గిందేమో... అతను లేచి నెమ్మదిగా గడియ తీశాడో లేదో ఒక్క విసురుగా గాలి జల్లు మొహంమీద కొట్టింది. ప్రచండ వేగంతో బయటగాలి ప్రళయనృత్యం చేస్తూంది. ఆ గాలికి ఉక్కిరిబిక్కిరి అయి అతి కష్టంమీద

తలుపు మూయగలిగాడు. ఆ గాలి వేగానికి, ఆ జల్లుకి కునికి పాట్లు పడుతున్న సీతమ్మ ఉలికిపడి లేచింది. "ఏమిటి తలుపు తీశారు... వెళ్ళిపోతారా" అంది.

"లేదండి వర్షం ఏమన్నా తగ్గిందేమోనని చూశాను. ఇందాకటి కంటె ఎక్కువయింది. గాలి ఎగరగొట్టేస్తూంది. మరి తగ్గదో ఏమిటో. అప్పుడే పదకొండు అవస్తూంది..." ఆందోళనగా అన్నాడు. "మరేం చేస్తారు... ఏదో తుఫానులా వుంది. ఆ గాలిలో ఎలా వెళ్ళగలరు." అంది సీతమ్మ. ఓ క్షణం ఆలోచించి ఆమె "మీ కభ్యంతరం లేకపోతే అలా ఆ మంచంమీద పడుకోండి. బీదవాళ్ళం అంతకంటె ఏర్పాటు చెయ్యలేం, పడుకోండి. వర్షం తగ్గాక వెళ్ళిపోదురుగాని మీరు మాత్రం ఎంతకని అలా కూర్చుంటారు."

"నా పడుక్కోడానికేం లెండి. నా బాధ అల్లా, ఈ ఒక్క గదిలో నేనూ చేరి మీ కిబ్బంది కలిగించానని."

"మీరేం చేస్తారు. పరవాలేదు లెండి... పడుకోండి." సీతమ్మ ఓ తలగడ దుప్పటి తీసి మంచంమీద పెట్టింది. అసలు అతని మాట దేముడెరుగు ఆమెకు నిద్ర ముంచుకు వస్తూంది. ఇంకా మొహమాటానికైనా అలా కూర్చోవడం, నిద్ర ఆపుకోవడం ఆమె వశంలో లేకుండా వుంది. అతనూ పడుకుంటే తనూ నడుం వాల్చచ్చు. ఈ రాత్రి గడి పెట్యాలి. చూస్తూ చూస్తూ ఓ గొప్పింటి బిడ్డని యీ వానలో ఎలా పొమ్మనగలదు బయటికి.

"సరే. నా గురించి మీరు మేలుకోకండి. పడుకోండి. అంతగా వర్షం తగ్గితే, నేను వెళ్ళేముందు మిమ్మల్ని లేపి వెళ్ళిపోతాను" అన్నాడు.

సీతమ్మ తల ఊపి దీపం బాగా తగ్గించి గదిలో ఓ వార పెట్టింది. పిల్లల ప్రక్కన చోటు చేసుకుని, చీరకొంగు వంటినిండా కప్పుకుని ముడుచుకుని పడుకుంది.

తన కాళ్ళు సగం వరకే వచ్చిన ఆ నులకమంచం మీద పడుకోడానికి నానా అవస్థలు పడి యిటు తిరిగి అటు తిరిగి ఎటూ సరిపోక ఆఖరికి కాళ్ళు ముడిచి వెల్లకిలా పడుకున్నాడు అతను. అతనికి నిద్ర పట్టడంలేదు. ఆ గాలికి, ఆ వర్షానికి, సగం తడిసిన బట్టలు, పక్క లేకుండా వున్న అతనికి చలి పుట్టుకొస్తూంది లోపల్నించి. సిగరెట్టు మరోటి తీసి వెలిగించాడు. కాని ఆ వేడి అతనికి చాలడంలేదు. ఈ దర్కిద్ర వర్షం లేకపోతే... హాయిగా యీ పాటికి డాక్ బంగళాలో డన్‌లప్ పరుపుమీద... "నీలూ" కౌగిలిలో వెచ్చగా పడుకుని ఉండేవాడు! ఈ దరిద్రపు వర్షంతోపాటు స్కూటర్‌లో పెట్రోలూ అయిపోవాలా! పెట్రోలు అయిపోకపోతే యీ వర్షంగాడు... ఏదీ తనని ఆపలేక పోయేది! వర్షం వస్తుందనే మేఘాలు కమ్ముకొస్తూన్నాయన్న భయంతోనే ప్రతీసారికంటె తొందరగా బయలు దేరాడు తను. ఆ హడావిడిలో పెట్రోలు సంగతి చూసుకోలేదు. పాపం నీలూ ఒక్కర్తీ ఎలా వుందో అక్కడ! నీలూ వచ్చిందో లేదో! అసలు యీ వర్షానికి రాలేక పోయిందేమో!... ఈ వర్షంలో ఏ టాక్సీవాడు మాత్రం

వస్తాడా ? వస్తే, ఒక్కర్తీ, దూరంగా వున్న ఆ డాక్ బంగళాలో, ఎవరూలేని చోట, వంటరిగా ఎలా వుందో ఏమిటో ? ప్చ్ !. కారు తీసుకు రావల్సింది ! ఇంట్లో రెండు కార్లు తగలడ్డా అవసరానికి ఎప్పుడూ వుండవు ! తండ్రి క్లబ్‌కి, అన్నగారు వదినగారు సినిమాలకి వేంచేశారుగదా ! అసలు కారు తీసుకొస్తే ఎక్కడికి, ఎందుకు, ఎప్పుడొస్తావు. అన్న ప్రశ్నలు వస్తాయని ఇలాంటప్పుడు కారు ముట్టుకోడు తను. స్కూటరయితే తన రాకపోకలని ఇంటిలో పట్టించుకోరు. రాత్రి రాకపోయినా, చదువుకుంటూ ఏ ఫ్రెండు రూములోనో పడుకుండిపోయాననవచ్చు ! ఆ అలవాటుతోనే స్కూటరుతో బయలుదేరాడు ! వర్షంతో త్రోవ కనిపించకపోయినా, గాలి తోసేస్తున్నా అలాగే మొండిగా ఇక్కడిదాకా వచ్చాడు ! పెట్రోలు అయిపోకపోతే ఆ రెండూ మైళ్ళూ అలాగే వెళ్ళి చేరేవాడు. వెళ్ళి హాయిగా నీలూ, అతనూ...ప్చ్, ఏంచెయ్యడం ఇప్పుడు! నడిచి వెళ్ళగలడా ఈ వర్షంలో. ఇంకా రెండు మైళ్ళుంది. వెళ్ళినా, నీలూ వచ్చి వుండకపోతే ..

అతనికి చాలా చిరాగ్గావుంది. క్రింద నులకమంచం గుచ్చుకుంటోంది. తలక్రింద తలగడ కంపు కొడుతూంది. డన్లప్‌ల మీద పడుకునే అతని దేహం అక్కడ పడుకోనని మొరాయిస్తూంది. ఉన్ని రగ్గూ లేక, నీలూ లేక అతను చలితో వణికేడు. వున్న ఆ ఒక్క సిగరెట్టు తీసి వెలిగించాడు.

ఆ గుడ్డివెలుతురులో గువ్వపిట్టలా ముడుచుకు పడుకున్న సీతమ్మని చూశాడు ! అలా చూస్తుంటే... పాపం... ఈవిడే డబ్బున్న ఆవిడయితే... మంచి చీరలుగట్టి, ముస్తాబు చేసుకుంటే ఏ ఆధునిక యువతికి తీసిపోదనిపించింది. ఆ మాటకొస్తే... నీలూ.. నీలు అంత డబ్బుండీ... శరీరాన్ని పాలతో పళ్ళతో పోషిస్తూ...అందమైన చీరలు కడితే, నీలూ కంటె బాగానే వుండచ్చునేమో ! పాపం !

నిజమే పాపం సీత !...ముఫ్ఫై ఏళ్ళు నిండా లేకుండానే మొగుడు పోగానే, వంటలక్క కాంగానే 'సీతమ్మ' అయి కూర్చుంది. మొగుడు బ్రతికుండగా, మొగుడు గుమస్తా అయినా, వున్న ఇద్దరు పిల్లల్ని పెట్టుకుని వున్నంతలో అందరూ ఆనందంగా హాయిగానే వుండేవారు. పచ్చగా, వత్తయిన నొక్కుల జుత్తుతో, సీత ఏ ఆభరణాలు లేకపోయినా కళకళలాడే బొట్టుతో అందంగానే వుండేది. సీత అందాన్ని చూసి కట్నం లేకుండానే పెళ్ళిచేసుకున్నాడు. పెళ్లి అయి పట్టుమని పదేళ్ళు అవకుండానే దురదృష్టం లారీ రూపంలో వచ్చి సీత భర్తని పొట్టపెట్టుకుంది. నిండా ముఫై ఏళ్ళన్నా లేని సీత, వెనకాల ఆస్థిపాస్తులే కాక ఆదుకునే వారు లేని సీత, ఆమె స్థితికి కంటతడి బెట్టేవారుతప్ప కంట నీరు తుడిచే వారెవరూ లేని సీత, ధర్డుఘారం మాత్రం పాపయిన సీత, వంటరిగా యీ పిల్లలని పెట్టుకుని ఎలా బ్రతకను భగవంతుడా అని ఏడ్చిన సీత- త్వరలోనే తన ఏడుపు తనే ఏడవాలని గ్రహించుకుంది. గుండె దిటవు చేసుకుంది. భర్త ప్రావిడెంటు ఫండు, ఇన్సూరెన్సు డబ్బు అన్నీ కలిపి మూడు

వేలు వస్తే ఆ డబ్బు చిల్లర మల్లరగా ఖర్చయిపోక ముందే తలదాచుకోడానికి ఓ గూడు అవసరం అని, ఆఫీసు వాళ్ళంతా చందాలు వేసుకుని ఊరికిదూరంగా చవకగా దొరికిన స్థలాన్ని కొనిఇస్తే ఆ మూడు వేలు పెట్టి ఓ గది వేసుకుంది. పంచదించి అక్కడ వండుకుంటూ గది కట్టించుకోడానికి మాత్రం సరిపోయింది ఆ డబ్బు. గూడు ఏర్పడ్డాక, రెక్కాడితే గాని డొక్కాడని స్థితి వచ్చిందని తెలుసుకుంది. తన విద్య ఏ ఉద్యోగాన్ని యివ్వదని ఆమెకి తెలుసు. ఆమె కొచ్చిన విద్య- అదే వంట- అదే ఆమె జీవనాధారమైంది. ప్లీడరు గారింటిలో ముప్పై రూపాయలకి వంటకి కుదిరింది. వాళ్ళు పెట్టిన భోజనం తింటున్నంత సేపూ ఇంటిలో పచ్చడి మెతుకులు తినే పిల్లలు కనిపించీ ఆ ముద్ద మింగుడు పడేది కాదు ఆమెకి. "అమ్మా నా పిల్లలతో పాటు కలో గంజో తాగుతాను. నాకీ భోజనం వద్దు తల్లీ, దాని బదులు డబ్బే ఇప్పించండి" అని వేడుకొంది. వారిచ్చే ఏభై, మధ్యాహ్నం పూట ఇరుగు పొరుగు చిన్న పిల్లలకి చదువు చెప్పి సంపాదించే మరో పాతిక మొత్తం డెభై ఐదు రూపాయలతో ఇద్దరి పిల్లల్ని ఎలిమెంటరీ స్కూల్లో చదివించుకుంటూ ఎలాగో బ్రతుకు వెళ్ళదీస్తూంది సీత, మంచి రోజుల కోసం ఎదురుచూస్తూ—

మనసులో బాధ, అలవాటులేని శ్రమ, హఠాత్తుగా పైన బడిన వైధవ్యం అన్నీ కలిసి ముప్పై ఏళ్ళ సీతని 'సీతమ్మ'గా మార్చేశాయి.

చలికి ఇంకా ముడుచుకు పడుకున్న సీతమ్మని చూసి అతను జాలిపడ్డాడు. తనకిచ్చిన దుప్పటి ఆమెకి కప్పితే బాగుండుననుకున్నాడు. తన చలి ఎలాగూ ఈ దుప్పటి తీర్చలేదు. కాని ఆవిడ ఏమనుకుంటుందో!...

అతను లేచి విసుగ్గా కాసేపు కూర్చున్నాడు. మరోసారి పడుకున్నాడు. ఒకసారి తలుపు కాస్త తెరిచి చూశాడు. ఇంకా తగ్గని వర్షాన్ని మరోసారి తిట్టుకున్నాడు. నిరుత్సాహంగా మంచ మీద వ్రాలాడు. కాల్చడానికి సిగరెట్టన్నా లేదు.

దీపంలో కిరసనాయిలు అయిపోయిందో గాలికోగానీ టపటప కొట్టుకుని ఆరిపోయింది. అతని గుండెలోంచి చలి పుట్టుకొస్తూంది. వేడి... వేడి... నీలూ ఇచ్చే వేడికోసం అతని మనసు, శరీరం ఏకమై కలవరిస్తున్నాయి.

—మంచి నిద్రలోవున్న సీతమ్మకి మంచి కలవచ్చింది. భర్త వచ్చాడు. వస్తూనే క్రింద పడుకున్న సీతని గట్టిగా కౌగిలించుకున్నాడు. రెండేళ్ళ తరువాత వచ్చిన భర్త కౌగిలిలో సీత కరిగిపోయింది. అతన్ని అల్లుకు పోయింది. అతని గుండెల మీద తల ఆన్చి పరవశించింది. ఇన్నాళ్ళూ నన్నొదిలి ఎందుకు వెళ్ళిపోయారు అంటూ అనురాగంతో గుండెలకి హత్తుకుంది. అతని చెంపలు నిమిరింది. జుత్తు సవరించింది. "మంచంమీద పడుకొందాం రా సీతా, ఇలా క్రింద పడుకొన్నావేమిటి" అంటూ ఆమెని లేవనెత్తి పొదువుకుని తీసుకెళ్ళి మంచం మీద పడుకోబెట్టాడు. రెండేళ్ళుగా పురుష స్పర్శని ఎరుగని ఆమె దేహం అతని చేతిలో, కౌగి

లిలో కరిగిపోయింది. పరవశించిపోయింది. ఆర్తితో అతన్ని అల్లుకుపోయింది. "మరెప్పుడూ విడిచి వెళ్ళకండేం" అంది. "ఇలా ఇంత సన్నగా అయిపోయారేమిటి" "నీ మీద బెంగ సీతా! నీవు లేకుండా ఎలావుంటాను" అన్నాడు భర్త. రెండేళ్ళ తరువాత ఆ రాత్రి తిరిగి ఆమెకి మొదటి రాత్రి అయింది. అమర సుఖాలని చవిచూసి అలిసిపోయిన ఆమె శరీరం విడుస్తే మళ్ళీ కంటబడకుండా పారిపోతాడన్నట్టు అతన్ని హత్తుకొని అతని చేతుల్లో రెండేళ్ళ తరువాత తృప్తిగా ఆనందంగా, హాయిగా ఆదమరిచి నిద్రపోయింది సీత.

"అమ్మా, అమ్మా, లే అమ్మా.." కొడుకు కుదిపి కుదిపి పిలుస్తూంటే కళ్ళు విప్పిన సీతమ్మ తుళ్ళిపడి లేచింది.

బయట బారెడు ప్రొద్దెక్కింది. వర్షం తగ్గినా గాలి వేస్తూంది ఇంకా. రాత్రి వర్షం భీభత్సవం సద్దుమణిగింది. ఆకాశం నిర్మలంగా వుంది.

చుట్టూ కాసేపు అయోమయంగా చూసింది సీతమ్మ. "మీ నాన్న ఏరిరా, ప్రొద్దునే ఎక్కడికెళ్ళారు ?" అంది.

కుర్రాడు తెల్లబోతూ చూచాడు "నాన్నేమిటమ్మా... నాన్న చచ్చిపోయాడుగా" ఉలిక్కిపడింది సీతమ్మ. అవును చచ్చిపోయారుగా ! మరి రాత్రెలా వచ్చారు ! కలా అది ! కలే అయితే...

తనున్న స్థితిని విస్తుపోయి చూసుకుంది సీతమ్మ. క్రింద పడుకున్న తను మంచ మీద కెప్పుడొచ్చి పడుకుంది ! తన వంటిమీద జాకెట్టు మంచం క్రిందికెలా వెళ్ళింది! చీర ఎలా వూడిపోయింది ! తన మీదకి ఈ దుప్పటెలా వచ్చింది !?..

"అబ్బ! అమ్మ దగ్గర ఎంత మంచి వాసన వేస్తుందో కదురా అన్నయ్యా. నిన్నరాత్రి మనింటి కొచ్చిన ఆయన దగ్గరలాంటి వాసనకాదూ..." అంది కూతురు అమాయకంగా తల్లి దగ్గర వేస్తున్న సువాసనని ఆస్వాదిస్తూ.

మరోసారి ఉలిక్కిపడింది సీతమ్మ. అతను! అవును అతనేమయ్యాడు!? "నిన్న వచ్చిన అతను ఎప్పుడు వెళ్ళిపోయాడురా, నన్ను లేపకపోయారా?" కొడుకుని అడిగింది. "మేం లేచే సరికే లేడమ్మా ఆయన."

సీతమ్మకేం అర్థంగాలేదు. తెలియని ఏదో భయంతో ఆమె గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. వంటికి అంటిపెట్టుకున్న సెంటువాసన ఆమెని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. తను తనుగా లేనన్నసంగతిని శరీరంలోని ప్రతి అణువూ స్పష్ట పరుస్తోంది. ఆమె శరీరం గజగజ వణికింది. చీర దగ్గరికి లాక్కొని లేవబోతూంటే కాళ్ళు వణికాయి. సీతమ్మ మొహం ఎర్రబడి పోయింది. ఆమెకంతా అయోమయంగా వుంది. ఆమె స్థితి ఏమిటో ఆమెకే అర్థం గావడం లేదు.

వింతగా చూస్తున్న పిల్లలని.. "వెళ్ళండవతలికి, వస్తున్నాను, ఏమిటలా చూస్తున్నారు. నా మొహాన కోతులాడుతున్నాయా, పదండవతలికి..." అనవసరంగా కసిరింది. పిల్లలు అలా తిరిగాక లేచి చీర కట్టుకుని క్రిందపడిన జాకెట్టు తీసుకుని తొడుక్కుంటూంటే...

అప్రయత్నంగా తలగడ క్రిందనించి కనిపిస్తున్న నోటు మీద ఆమె దృష్టి పడింది. చటుక్కున తీసింది, నూరు రూపాయల నోటు!!

నూరు రూపాయలు ! ఆ నోటు చూడగానే అంత వరకువున్న కాస్త అనుమానం ఆమెకి తీరిపోయింది ! ఆ నోటు చేత్తో పట్టుకుని నిలువెల్లా సిగ్గుతో చితికిపోతూ అలాగే నిలబడిపోయింది సీతమ్మ.

కోపమో, అవమానమో, సిగ్గో, ఆవేదనో ఏదో తెలియని భావం ఆమె మనసుని పిండుతూంది.

తల్లి ఎంతకీ రాకపోవడంతో పిల్లలిద్దరూ మళ్ళీ గది లోకి వచ్చారు. నోటు చేతిలో పట్టుకొని నిల్చున్న తల్లిని చూసి కొడుకు ఆరాటంగా ముందుకు వచ్చి ఆమె చేతిలో నోటు అందుకున్నాడు. "అమ్మో... నూరు రూపాయలే... ఎవరిచ్చారమ్మా..." మొహం నిండా సంతోషం, ఆశ్చర్యం నింపుకుని నోటుని అపురూపంగా చూస్తూ అన్నాడు పద కొండేళ్ళ కొడుకు. వాడికి తమ దరిద్రం సంగతి, నెలకి డెభై ఐదు రూపాయలు సంపాదించడానికి తల్లిపడే కష్టం తెలుసు. తమ బ్రతుకులో ఒక్క సారిగా నూరు రూపాయలు దొర కడం అన్నది అదృష్టంఅనీ, అందులోవున్న ఆనందం ఎంతో- వాడికి అర్థం చేసుకోగల వయసుంది. "అమ్మా, ఎవరిచ్చా రమ్మా... నిన్నను వచ్చినాయనా... ఎందుకిచ్చారమ్మా..." ప్రశ్నలు కురిపిస్తున్నాడు కొడుకు.

సీతమ్మ తెలివి తెచ్చుకొని కొడుకు చేతిలో నోటు అందుకుంది ఆవేశంగా "ఇలా ఇయ్యరా అది. ఈ పాపిష్టి డబ్బు మనకి వద్దు ..." అంటూ ఆవేశంగా నోటు చింప బోయింది.

"అమ్మా !" బాబు గాభరాగా తల్లి చేతిలోంచి నోటు లాగేసుకున్నాడు. తల్లి మాటకి అర్థం తెలియక ఆశ్చర్యంగా చూశాడు.

"అది ఇలా యియ్యి ..." కోపంగా అంది సీతమ్మ. "ఇలా ఇచ్చేయి...ఆ డబ్బు ఇంట్లో వుండడానికి వీలులేదు." లాక్కుంది సీతమ్మ.

"అమ్మా ... !" కొడుకు దీనంగా తల్లి ముఖంలోకి చూస్తూ, అపురూపంగా నోటువంక చూశాడు. అర్థం తెలి యని, చేసుకోలేని వయసులోవున్న కూతురు బిక్కమొహం వేసుకు చూస్తూంది.

"అమ్మా ... !" కొడుకు మొహంలోని దీనత్వం చూసిన సీతమ్మ, ఆ నోటువంక చూసింది. పిల్లల మొహాలు చూసింది, ఆమె ఆవేశం చప్పునదిగజారింది. నోటు పట్టు కున్న ఆమె చెయ్యి వణికింది. చూస్తూ చూస్తూ ఆ నోటు చింపలేకపోయింది. నిస్సహాయంగా పిల్లలవంక చూసింది.

"అమ్మా. ఎందు కొద్దమ్మా ఆ డబ్బు. నూరు రూపా యలు చింపేస్తావా ?" దైన్యంగా అడిగాడు ... "ఎవరిచ్చా రమ్మా ... నిన్నను వచ్చినాయనా ... ఎందుకిచ్చారమ్మా. మనకి డబ్బు లేదని ఇచ్చారుగదూ !" సీతమ్మ కొడుకువంక చూసింది.

సీతమ్మ ఒక్కక్షణం ఆలోచించింది ... తరువాత, నోటు జాగ్రత్తగా మడతపెట్టి పెట్టెలో పెట్టింది. కొడుకు సంతోషంగా చూశాడు ... పిల్లలిద్దరిని చూస్తూ ... "అవు నురా ...నిన్న వచ్చిన ఆయనే ఇచ్చాడు. మనం బీదవాళ్ళం

అని, డబ్బు లేదని ఇచ్చాడు ... మనం బీదవాళ్ళమని దేవుడే ఆయన్ని పంపాడు. వాన దేముడు ఆయన్ని మనింటికే పంపించాడు ... మనకి డబ్బు యిూయమని ..." అంది తడబడ్తూ.

పిల్లలు ఆశ్చర్యంగా వింటున్నారు..."చూడండి...ఇలా మనకి డబ్బు ఇచ్చిన విషయం మిూరెవరితో అనకండేం." అంది. పిల్లలిద్దరూ సంతోషంగా తలలూపారు.

వారంరోజుల తర్వాత మధ్యాహ్నం మూడుగంటల వేళ ... దట్టంగా మబ్బుపట్టింది. సీతమ్మ నూరురూపాయలు పెట్టి — తనకి రెండు కట్టుడు చీరలు, రెండుదుప్పట్లు, పిల్లలిద్దరికి చెరి రెండు జతల బట్టలు కొంది. కొన్న గుడ్డలలో గౌనుగుడ్డ చించి సూది దారం పుచ్చుకుని, వీధిగుమ్మంలో కూర్చుని గౌను కుడ్తుంది. పిల్లలిద్దరికీ చాలా సంతోషంగా వుంది. క్రొత్తబట్టలు-అందులో రెండేసి జతలు! సంతోషంగా తల్లి దగ్గర కూర్చున్నారు చూస్తూ.

"అమ్మా... వాన వస్తుందా అమ్మా!" అంది ఏడేళ్ళ కూతురు. సీతమ్మ ఆకాశంవైపు చూసి... "వచ్చేట్టేవుంది... మబ్బుపట్టింది బాగా ..." అంది.

"అమ్మా ... అయితే ఆయన మళ్ళీ వస్తారా అమ్మా మనింటికి ... వానదేముడు మళ్ళీ పంపిస్తాడా అమ్మా ... ఈసారి...వాళ్ల జయ కుట్టించుకున్న జరీ పరికిణీకొంటావా?" ఆశగా అడిగింది.

"అన్నయ్యా వర్షం వస్తే బాగుంటుందికదూ !" అంది అమాయకంగా. సీతమ్మ ఉలిక్కిపడింది. పిల్ల పరి

గత్తికెళ్ళి ... "వానాలు కురవాలి. వరిచేలు పండాలి — వానదేముడు పంపాలి ... జరీ పరికిణీ కొనాలి..." తాను పుస్తకంలో చదువుకున్న పాటకి స్వంత కవిత్వాన్ని జోడించి గిరగిర తిరుగుతూ సంతోషంగా పాడుకుంటూంది. సీతమ్మ మొహం ఎర్రబడింది. కూతురిని ఏమనలేక చటుక్కున లేచి లోపలికి వెళ్ళిపోయింది.